120, 100, 90, 80, 70, 60, 50.. ఇవేవీ ఇండియా క్రికెట్ స్కోర్లు కావు. అలా అని ఇవి పెరుగుతున్న స్టాక్‌మార్కెట్ పాయింట్లు కూడా కావు. ఇవి నిన్న మొన్నటి వరకు పేద, మధ్య తరగతి ప్రజలను బెంబేలెత్తించిన కూరగాయల ధరలు. ఉల్లి మొదలుకుని వంకాయ, బఠాణీ, క్యారెట్, కాలీఫ్లవర్, చిక్కుడు, బొరబాటి, టమాటా వంటి కాయగూరలు అధిక ధరలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి.

హమ్మయ్య.. తగ్గాయి



- దిగి వచ్చిన కాయగూరల ధరలు
- కార్తీకమాసం, పిక్నిక్‌లు, వన భోజనాలు, అయ్యప్ప దీక్షలు, పెళ్లిళ్ల తర్వాత శాంతించిన రేట్లు
- ఊపిరి పీల్చుకుంటున్న పేద, మధ్య తరగతి ప్రజలు

జగదాంబ: కిందటి నెల వరకు నేలకు దిగి రాని కాయగూరల ధరలు ఇప్పుడు మెల్లగా తగ్గుతున్నాయి. కార్తీక మాసంలో ఆకాశాన్ని తాకిన కాయగూరల ధరలు అన్ని వర్గాల ప్రజలను బెంబేలెత్తించాయి. పూజలు, వ్రతాల వల్ల అధిక సంఖ్యలో ప్రజలు కాయగూరలే తినటం.. అయ్యప్ప స్వాముల అన్న సమారాధనలు, భిక్ష, ఇతర మాలధారులకు అన్న వితరణ వంటి వాటి వల్ల కాయగూరల ధరలు అందుబాటులో లేకుండా పోయాయి.

రైతు బజార్లలో కూడా..

పేదలు, సామాన్యులు ఏ కాస్తో కాయగూరలు కొనుక్కోగలిగేది రైతుబజార్లలోనే. అలాగే పూర్ణా మార్కెట్‌లో కూడా బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకు కూరగాయలు దొరికే వీలుండటం వల్ల అంతా శక్తి కొద్దీ కూరగాయలు కొనుక్కునేవారు. అయితే కార్తీకమాసంతో పాటు ఆ ముందు నెలల్లో కూడా రైతుబజార్లు, పూర్ణామార్కెట్‌లో కూడా ధరలు ఆకాశాన్ని అంటడంతో అంతా గగ్గోలు పెట్టారు.

మారిన పరిస్థితి..

ఇలా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన కాయగూరల ధరలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. కార్తీకమాసం పూర్తి కావడం, మాలధారులు తగ్గటం వంటి కారణాల వల్ల పేద, సామాన్య ప్రజలకు కాయగూరల ధరలు అందుబాటులోకి వస్తున్నాయి. వంకాయలు, టమాటాలు, ఉల్లిపాయల వంటి ముఖ్యమైన కాయగూరల ధరలు తగ్గి ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. వెల్లుల్లి ధర మాత్రం అలాగే ఉంది.

గతంలో ఎప్పుడూ ఈ ధరలు చూడలేదు..



గతంలో ఏనాడూ ఇంత అధిక ధరలు చూడలేదు. ఇప్పుడు తగ్గుతున్నాయి లెండి. ఇప్పటికీ వెల్లుల్లి కొనలేని పరిస్థితి. ఇప్పుడు ధరలు తగ్గడంతో కాస్త ఉపశమనం దొరుకుతోంది. ఇంటిల్లిపాదీ కూరలు తినగలుగుతున్నాం. మళ్లీ ధరలు ఎప్పుడు పెరిగిపోతాయో అని భయంగా ఉంది. ప్రభుత్వం ధరల పెరుగుదలపై చర్యలు తీసుకోవాలి.

– గంగాధర్, వినియోగదారుడు

అకాల వర్షాలు.. పెళ్లిళ్ల సీజన్..

కార్తీకమాస పుణ్యకాలంతో పాటు అకాల వర్షాల వల్ల తగినంత పంట దిగుబడి లేకపోవడం, పెళ్లిళ్ల సీజన్ వంటి కారణాల వల్ల కూడా కాయగూరల ధరలకు రెక్కలొచ్చాయి. బజారుకు తీసుకెళ్లే బ్యాగ్ వినియోగదారుడిని వెక్కిరించేది. కరెన్సీ ఆవిరై పోయి జేబు బావురుమనేది. పచ్చనోట్లు ఖర్చు చేసినా సంచి నిండకుండా ఇంటి దారి పట్టాల్సి వచ్చేది.



సంచి నిండుతోంది..



నిన్న మొన్నటి వరకు ధరలు చూస్తే బెంబేలెత్తిపోయాం. కార్తీకమాసం తర్వాత ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి రాగలుగుతున్నాం. అయిదొందలు తీసుకొస్తే ఉల్లిపాయలు, టామాటాలతో పాటు రెండు రకాల కూరలు మాత్రమే వచ్చేవి. దీక్షల సమయంలో కాయగూరలు కొనలేకపోయేవాళ్లం. ఇప్పుడు ధరలు తగ్గి సంచి నిండుతోంది. –మహేష్, వినియోగదారుడు

పూర్ణామార్కెట్‌లో ఈ వారం కూరగాయల ధరలు కిలోల్లో ఇలా..

వంకాయలు	రూ. 40	బీరకాయలు	రూ. 60	క్యాబేజీ	రూ. 40
నల్లవి	రూ. 40	చిక్కుడుకాయలు	రూ. 60	క్యారెట్	రూ. 50
ఉల్లిపాయలు	రూ. 30	గోరుచిక్కుళ్లు	రూ. 40	బీట్‌రూట్	రూ. 40
టమాటాలు	రూ. 45	బీన్స్	రూ. 70	సీమదుంపలు	రూ. 40
వెల్లుల్లి	రూ. 400	బెండకాయలు	రూ. 60	బంగాళాదుంపలు	రూ. 30
అల్లం	రూ. 60	దొండకాయలు	రూ. 50	ఆనపకాయ	రూ. 30
పచ్చిమిర్చి	రూ. 40	పొటల్స్	రూ. 50	ములక్కాడ (3)	రూ. 30
క్యాప్సికం	రూ. 60	కాలీఫ్లవర్	రూ. 30	కొత్తిమీర కట్ట	రూ. 10

కాలు జారితే పాతాళానికే



రామకృష్ణా రైతు బజార్ జంక్షన్ వద్ద శిథిలమైన కెనాల్ ఇనుప చట్రం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు రామకృష్ణా రైతు బజార్ జంక్షన్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. నగర నలుమూలల నుంచి ఈ బజార్ మీదుగా మురుగు వెళ్లే కెనాల్ ఉంది. పది అడుగుల వెడల్పుతో ఉండే ఈ కెనాల్ నుంచి నిత్యం మురుగు నీరు ప్రవహిస్తుంటుంది. ఈ కెనాల్‌లో ప్లాస్టిక్, ఇతర వస్తువులు అడ్డుపడితే తీసేందుకు పైన ఇనుప చట్రం (జాలీ) వేశారు. అయితే ఇప్పుడు ఆ జాలీ పూర్తిగా శిథిలమై పెద్ద రంధ్రంగా ఏర్పడింది. ఈ రైతుబజార్ పరిసరాల్లో వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ రంధ్రం ద్వారా ఎవరైనా కాలు జారి కెనాల్లో పడిపోతే ఆ వ్యక్తిని సముద్రం నుంచి తీయాల్సి వస్తుంది. ఎందుకంటే ఈ కెనాల్ ప్రవాహం సముద్రంలో కలుస్తుంది గనుక. అటువంటి పరిస్థితి ఉన్న కెనాల్ వద్ద గత కొన్ని రోజులుగా ఓ చిన్న కర్ర ప్రమాద సూచికగా పెట్టి వదిలేశారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే కెనాల్‌పై ఇనుప జాలీ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ద్రోణంరాజుకు ఘన నివాళి



ద్రోణంరాజుకు నివాళులు అర్పిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: స్వర్గీయ ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము నివాళులు అర్పించారు. సిరిపురం జంక్షన్‌లో గల ద్రోణంరాజు సత్యనారాయణ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు బజార్ స్టాళ్లకు డ్రా



రైతు బజార్ స్టాళ్లకు డ్రా తీస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

మహారాణిపేట: రైతు బజార్లలో ఖాళీగా ఉన్న వివిధ స్టాళ్లకు గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సమక్షంలో డ్రా తీశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో దరఖాస్తుదారులు, రైతుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 23 డ్వాక్రా, 7 దివ్యాంగులు (పీహెచ్‌సీ)కి కలిపి మొత్తం 30 స్టాళ్లకు డ్రా తీశారు. పీడీ డీఆర్‌డీఏ, దివ్యాంగుల విభాగం పర్యవేక్షణ అధికారి, జీవీఎంసీ యూసీడీ ఏపీడీ, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్, పలు రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్ల సమక్షంలో డ్రా తీసి స్టాళ్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి షెల్టర్‌కు తరలింపు



గుర్తు తెలియని వ్యక్తిని ప్రశ్నిస్తున్న షెల్టర్ ప్రతినిధి

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ 4వ లైన్‌లోని గాయిత్రీ కాలేజీ వద్ద చాలా రోజుల నుంచి ఒక యువకుడు చలిలో పడుకుంటున్నాడని సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత అందించే జయరాజ్ ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది జ్యోతిర్మయి, శ్రీనివాస్, ప్రశాంత్ వెళ్లి ఆ యువకుడిని తీసుకొచ్చి టీఎస్సార్ కాంప్లెక్స్ షెల్టర్‌లో అతనికి ఆశ్రయం కల్పించారు. వైద్య పరీక్షలు చేయించి అతని ఊరు, పేరు అడిగినా చెప్పడం లేదని వాసు తెలిపారు.

కార్తికేయకు అభినందనలు



పతకాలతో కార్తికేయ

దాబాగార్డెన్స్: పోర్టు స్టేడియంలో ఇటీవల జరిగిన 2వ వైజాగ్ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో పాత నగరానికి చెందిన కార్తికేయ సత్తా చాటాడు. 9 నుంచి 10 ఏళ్ల కేటగిరీలో రెండు విభాగాల్లో పోటీ పడి గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. కాటా విభాగంలో గోల్డ్, కుమిటీ విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఈ మేరకు గురువారం కోచ్ నూకరాజు, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ యాజమాన్యం కార్తికేయను అభినందించారు.

వర్షంతో రైతుబజార్ ఖాళీ



వర్షంతో ఖాళీగా ఉన్న రైతుబజార్

సీతమ్మధార : ఎడతెరిపి లేని వర్షంతో సీతమ్మధార, గురుద్వారా, బాలయ్య శాస్త్రి లే అవుట్, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గాంధీనగర్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. వర్షం కురుస్తుండడంతో సీతమ్మధార రైతుబజార్ సాయంత్రం బోసిపోయింది. వినియోగదారులు లేక రైతులు, వ్యాపారులు దిగాలుగా ఎదురుచూడడం కనిపించింది. చిరు వ్యాపారులు కూడా బేరాలు లేక ఇంటిముఖం పట్టారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నిరసన



అమిత్ షా చిత్రపటాలు చింపుతున్న కాంగ్రెస్ నాయకులు

దాబాగార్డెన్స్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు గురువారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పిరిడి భగత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ, నెహ్రూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అవమానిస్తోందన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, జాతి నాయకులను బీజేపీ చులకనగా చూస్తోందని, 140 కోట్ల మంది భారత ప్రజలు త్వరలోనే బీజేపీకి బుద్ధి చెప్పనున్నారని తెలిపారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీ, నెహ్రూ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రతిసారీ అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఈ అవమానం దళిత, మైనార్టీ సామాన్య ప్రజలపై దాడిగా చూస్తున్నామన్నారు. దళిత మైనార్టీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు హోం మంత్రి వ్యాఖ్యలను ఖండించకపోవడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీ సూర్యనారాయణ, సోడదాశి సుధాకర్, చినబాబు, కస్తూరి వెంకట్రావు, జగన్ మురారీ, కె. గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ద్రోణంరాజు సత్యనారాయణకు నివాళి..

ద్రోణంరాజు సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని సిరిపురం జంక్షన్‌లో గల ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి, పలువురు పార్టీ నాయకులు నివాళులర్పించారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి ఉత్తరాంధ్ర ప్రజలకు అనేక సేవలందించారని ఈ సందర్భంగా ద్రోణంరాజు సత్యనారాయణను కొనియాడారు. కార్యక్రమంలో పిరిడి భగత్, గుర్రం కనకరాజు, జోగేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవొద్దు



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్‌లో గురువారం డ్రగ్స్ వాడకాన్ని నిరసిస్తూ యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల ఆరోగ్యం, జీవితం, భవిష్యత్తు నాశనమవుతాయన్నారు. యువత మంచి ఆరోగ్య జీవనాన్ని అలవర్చుకుని ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ఆచార్య ఎస్.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన బాల్యమే దేశ వికాసానికి సౌభాగ్యం



విద్యార్థుల బరువు, ఎత్తు కొలుస్తున్న డాక్టర్ సమత



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అల్లిపురం: రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం అనేది డిఫెక్ట్, డిసీజ్, డిసేబిలిటీ, డెవలప్‌మెంట్ (లోపం, వ్యాధి, అంగవైకల్యం, ఎదుగుదల మందగించడం) వంటి వాటిని సరిదిద్దడం అని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ సమత అన్నారు. గురువారం ఆమె అల్లిపురం, అమ్మవారి వీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, అంగవైకల్యం, ఎదుగుదల మందగించడం వంటి రుగ్మతల వల్ల వారిలో జీవన నాణ్యత తగ్గుతుందని, దానిని మెరుగుపరచడం ద్వారా మంచి ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సహాయం పొందిన పాఠశాలల కింద నమోదు చేసుకున్న పిల్లలను ఆర్‌బీఎస్‌కే కింద మొబైల్ ఆరోగ్య సిబ్బంది ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య పరిస్థితులను ఆమె అల్లిపురం యూపీహెచ్‌సీ ఏఎన్‌ఎం కె.తులసి, అంగన్‌వాడీ వర్కర్ ఎం.అరుణప్రియతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ తను, ఆయా అప్పలకొండ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాచకులకు రగ్గుల పంపిణీ

తాటిచెట్లపాలెం : జ్ఞానాపురం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గల యాచకులకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ నగరంలో రాత్రి వేళల్లో పలు ప్రాంతాల్లో చలిలో యాచకులు, నిరాశ్రయులు నిస్సహాయ స్థితిలో తలదాచుకోవడం తమ సంస్థ సభ్యులు గుర్తించారన్నారు. తమ వంతుగా వారికేమైనా సహాయం చేయాలని ఆలోచించి రగ్గులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సుమారు 100 మందికి రగ్గులు పంపిణీ చేశారు.

కేజీహెచ్‌కు సమకూరిన రెండు పరికరాలు



పరికరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శివానంద్, డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెండు పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. రూ. 60 లక్షలు విలువ చేసే జీఐ ఎండోస్కోప్‌లు, రూ.90 లక్షలు విలువ చేసే రెండు కొలొనోస్కోప్‌లు కేజీహెచ్ జనరల్ డిపార్టుమెంట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో అమర్చారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎంఎంసీ) నిబంధనల ప్రకారం ఈ పరికరాలు అవసరం ఎంతో ఉంది. ఇవి రోగులకు ఉపయోగకరంగా ఉంటాయి. వీటిని గురువారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మన్మథరావు, సర్జరీ ప్రొఫెసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ తేజేశ్వరరావు, డాక్టర్ అమ్మాజీ, అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ అపరంజి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ



ఉచిత ప్రసాదం అందజేస్తున్న సింహాచలం తదితరులు

దాబాగార్డెన్స్: శెట్టి బలిజ–యాత కులస్తుల సంఘం ఆధ్వర్యంలో మార్గశిర మాసం మూడో గురువారాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. సంఘం కోశాధికారి నెల్లి సోమేష్, లక్ష్మీ దంపతుల సహకారంతో టౌన్ కొత్తరోడ్డు వద్ద సంఘం అధ్యక్షురాలు, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యురాలు మళ్ల ధనలత, సంఘం కార్యదర్శి రాజు చేతుల మీదుగా పలువురు భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో నెల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో జాబ్‌మేళా రేపు



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జవహర్ నాలెడ్జ్ సెంటర్, సూర్య ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాలలో గురువారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. టాటా గ్రూప్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, అరబిందో ఫార్మా, హోండా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం, ఎస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో, తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు తీసుకుని శనివారం ఉదయం 9.30 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

వాయు కాలుష్య నియంత్రణకు కార్యాచరణ



వాయు కాలుష్యం నియంత్రణపై చర్చిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ

డాబాగార్డెన్స్: వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అర్తా గ్లోబల్ సంస్థతో కలిసి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీరు శివప్రసాద్‌రాజు అధ్యక్షతన వాయు కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ, అర్తా గ్లోబల్ సంస్థ సంయుక్తంగా వర్క్ షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ రమణమూర్తి మాట్లాడుతూ నగరంలో వాయు కాలుష్యం పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు అర్తా గ్లోబల్ సంస్థ, జీవీఎంసీ సంయుక్తంగా కృషి చేస్తున్నాయని, ముఖ్యంగా విశాఖ నగరాన్ని క్లీన్ హెయిర్ జోన్స్‌గా నిలిపేందుకు అనేక కార్యాచరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు ఏ విధంగా చర్యలు చేపట్టాలనే అంశంపై ఏయూ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర సంస్థలతో చర్చించి చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ చేపడతామన్నారు. అనంతరం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ అంశంపై జీవీఎంసీ అధికారులు, ఏయూ విద్యార్థులకు అర్తా గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు క్లీన్ ఎయిర్, ట్రాఫిక్ నియంత్రణ, కాలుష్యం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎస్. రామకృష్ణారావు, బాల ప్రసాద్, డీటీవో ఆదినారాయణ, ఏపీఎస్‌ఆర్‌టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రతినిధులు డాక్టర్ అంజాగోయిల్, శివాని ఫౌండేషన్ ప్రతినిధి అమేయ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని స్వర్ణ వస్త్రాలంకరణలో అలంకరించారు. మూడో గురువారాన్ని పురస్కరించుకుని మూల విరాట్‌కు ప్రాత:కాల ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన గోమతి చక్రాలతో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి డీవీ బాలాజీకుమార్, ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు బాదం నాగ వెంటక కమలశ్రీ, కట్టమూరి ప్రసన్న, కడిమిశెట్టి దంతేశ్వరి, గ్రంధి దేవి, పోలూరి స్వర్ణలత, కొల్లూరు విశాల, గ్రంధి ఉష, కందుల గీతా ఆదిలక్ష్మి, పసుమర్తి హైమావతి, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పన్ను రేటు హేతుబద్ధీకరణకు విరుద్ధం

దాబాగార్డెన్స్: పొగాకు ఉత్పత్తులు, కార్బొనేటెడ్/ఎరేటెడ్ పానీయాల కోసం 35 శాతం పన్ను రేటులో కొత్త శ్లాబ్‌ను మంత్రుల బృందం సిఫారసు చేయడం జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణ లక్ష్యానికి విరుద్ధంగా ఉందని జేఎస్‌ఏ భాగస్వామి ఉపేంద్రనాథ్ శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఎస్టీ విధానం పన్నులను సులభతరం చేసిందని, భౌగోళిక, రాజకీయ పరిణామాలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో వృద్ధి, ద్రవ్యోల్బణం మధ్య సమతుల్యతను సాధించడం ప్రభుత్వానికి కీలకమన్నారు. పన్ను శ్లాబ్‌లు తగ్గించాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. డబ్ల్యూహెచ్‌వో డేటా ప్రకారం తలసరి ఆదాయ స్థాయిల ఆధారంగా అధిక పన్నులతో భారతదేశంలో సిగరెట్ల ధర భరించలేని స్థితికి చేరుకుంటుందన్నారు. పన్ను ఎగవేత కారణంగా చౌకగా విక్రయించే స్మగ్లింగ్ సిగరెట్లను వినియోగదారులు ఎంచుకుంటారని చెప్పారు. కొన్నేళ్లుగా సిగరెట్లపై అధిక పన్ను విధించడం వల్ల చట్టబద్ధమైన పన్ను చెల్లించే సిగరెట్ల ఖర్చుతో అక్రమ వ్యాపారం పెరిగిందని, అటువంటి ఉత్పత్తుల కోసం గ్రే మార్కెట్‌లో పెరుగుదల ప్రతికూలంగా ఉంటుందన్నారు. దిగుమతి చేసుకున్న నకిలీ ఉత్పత్తులు ఎటువంటి తనిఖీలు లేకుండా, మైనర్లతో సహా అనియంత్రిత పద్ధతిలో విక్రయించబడతాయన్నారు.